# మొదటి ప్రపంచయుద్ధ శత సంవత్సర 'సంబరాలు'

## బట్టబయలైన సామ్రాజ్యవాదుల కుట్రలు

**మొదటి** ప్రపంచయుద్ధం ముగిసి నూరు సంవత్సరాలైన సందర్భాన్ని పురస్కరించుకొని 2018 నవంబర్ 11న డోనాల్డ్ ట్రంప్, వ్లదిమీర్ పుతిన్‌లతో సహా 70 మంది వివిధ ప్రపంచ దేశాధినేతలు పారిస్‌లో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. ఆర్క్ డి ట్రయంఫ్ వద్దనున్న 'ఓ అజ్ఞాత సైనికుని' స్మారక సమాధివద్ద వారంతా కలసి కూర్చొన్నారు. సాంప్రదాయ సంగీతంతో పాటుగా, మొదటి ప్రపంచయుద్ధంలో మరణించిన సైనికులు వ్రాసిన ఉత్తరాలను ఈ కార్యక్రమంలో బిగ్గరగా చదివి వినిపించారు.

మొదటి ప్రపంచ యుద్ధంలో భారత సైనికులు నిర్వహించిన పాత్రను సంస్మరించుకుంటూ ఫ్రాన్స్‌లోని లావెంటై పట్టణంలో ఓ స్థూపాన్ని ఆవిష్కరించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో మరణించిన 57 మంది సైనికులను ఫ్రాన్స్‌లో ఖననం చేశారు. వారందరి స్మృతిలో నిర్మించాలనుకున్న 57 స్థూపాలలో లావెంటైలో ఆవిష్కరించిన స్థూపం మొదటిది. మొదటి ప్రపంచయుద్ధం ముగిసినప్పుడు ప్రయోగించిన వాయిద్యాలను మోగిస్తూ ఈ కార్యక్రమాన్ని ముగించారు. కామన్‌వెల్త్ నాయకులు కూడా ప్రపంచానికి శాంతి, ఆశలతో కూడిన సందేశం ఇచ్చారు. వంద సం॥ల క్రితం వీరి సైనికబలగాలు బ్రిటిష్ సైనికశక్తి అధీనంలో వుండి పోరాడాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, భారతదేశం, హాంగ్‌కాంగ్, మయన్మార్ మరియు అనేక ఇతర దేశాలలోనూ ఈ రెండవ ప్రపంచ యుద్ధ శత వత్సర వేడుకలు జరిగాయి. ఫ్రాన్స్‌కు 200 కి॥మీ దూరంలోనున్న విల్లర్స్ గుయిషాన్ వద్ద మొదటి ప్రపంచయుద్ధ స్మారక చిహ్నాన్ని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆవిష్కరించాడు.

యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా(యుఎస్‌ఐ) లోభాగమైన 'సెంటర్ ఫర్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ హిస్టారికల్ రీసెర్చ్' సంస్థ కార్యదర్శి స్క్వాడ్రన్ లీడర్ ఛిహినా మాట్లాడుతూ యుద్ధాలలో భారతసైన్యం అందించిన తోడ్పాటును యుఎస్‌ఐ ప్రముఖంగా ముందుకు తీసుకువస్తుందని పేర్కొన్నాడు. అందులో భాగంగా, భారతదేశంలో పెద్దస్థాయిలో జరిగిన 1857 తిరుగుబాటు, కోహిమా మరియు ఆంగ్లో–శిక్కు యుద్ధాల వంటి వాటి "యుద్ధ వ్యూహాల మార్గదర్శి"లను తయారు చేసి యుద్ధక్షేత్రాల మార్గదర్శనాల పర్యాటకాన్ని పెంపొందించాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు. "యూరప్‌లోని అనేక ప్రాంతాల స్థానిక ఆర్థిక వ్యవస్థలు ఈ బ్యాటిల్ ఫీల్డ్ టూరిజమ్ ద్వారానే మనగలుగుతున్నాయని" ఆయన వివరించారు.

2018 నవంబర్ 'జనశక్తి' సంచికలో వ్యాఖ్యానించినట్లుగా మొదటి ప్రపంచయుద్ధం రెండు సామ్రాజ్యవాద దేశాల సమూహాల మధ్య– 'ఎవరు ఈ ప్రపంచాన్ని పాలించాలి' లేదా 'ఎవరి ఆధిపత్యం ప్రపంచంపై సాగాలి' అనే సమస్యపై సాగిన యుద్ధమే. రక్తసిక్తమైన ఆ యుద్ధంలో లక్షలాదిమంది వివిధ వలస దేశాల ప్రజానీకం బలవంతంగా బలిపశువులుగా వధించబడ్డారు. "శాంతిస్థాపన కోసం" భారత సిపాయిలు మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారని భారత ప్రధాని నరేంద్రమోడీ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించటం సిగ్గుపడాల్సిన విషయం. ఈ వ్యాఖ్యానం భారత ప్రజలందరికీ అవమానకరమైనది. వలస బానిసత్వపు మానసిక స్థితి కొనసాగటాన్నే ఇది వెల్లడి చేస్తోంది.

2018 నవంబర్ 11న ఫ్రెంచ్ అధ్యక్షుడు మొదటి ప్రపంచయుద్ధ స్మారకోపన్యాసం చేస్తూ "గత కాలపు గుణపాఠాలను మరచిపోవద్దు. శాంతికోసం ప్రపంచ వ్యాపిత ఆశలను మరిచి పోవద్దు" అని తన సహనేతలకు పిలుపునిచ్చాడు. "ఉపసంహరణ, హింస, ఆధిపత్యాలపట్ల ఆరాధనతో ఈ ఆశను నాశనం చేయటం, భవిష్యత్తు తరాలు మన బాధ్యతను గురించి ప్రశ్నించే ఖచ్చితమైన తప్పిదమవుతుందని" ఆయన హెచ్చరించాడు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రపంచంపై ఆధిపత్యంకోసం జరిగిందన్న వాస్తవాన్ని ఆయన అంగీకరిస్తున్నాడేమోనని ఇది వింటే అనిపిస్తుంది. ఈ వాస్తవాన్ని అంగీకరిం చటమంటే వంద సంవత్సరాల క్రితం సాగించిన వినాశకర యుద్ధమనే ఘోరమైన నేరానికిగానూ ప్రపంచ ప్రజానీకానికి కనీసంగా వారు క్షమాపణలు చెప్పుకోవాలి. అయితే సామ్రాజ్యవాద శక్తులు అందుకు భిన్నంగా మొదటి ప్రపంచయుద్ధ ముగింపును వేడుకలుగా నిర్వహిస్తున్నాయి. దీనిని ఓ గొప్ప చారిత్రక ఘట్టంగా అభివర్ణిస్తున్నాయి. ఈ యుద్ధంలో మరణించిన సైనికులను గొప్ప హీరోలుగా, వారి త్యాగాలను అమోఘమైనవిగా కీర్తిస్తున్నాయి. వేడుకలు నిర్వహించటంద్వారా, వాస్తవానికి, సామ్రాజ్యవాద దేశాలు వారివారి మాజీ వలసలతో ఈనాటికీ తమ బంధాన్ని సజీవంగా నిలిపివుంచుతున్నాయి. వలస పాలకుల, సామ్రాజ్యవాద ప్రభువుల సేవలో మరణించటం గౌరవ ప్రదమైనదిగా, గర్వించదగినదిగా శిఖర సమాన అబద్ధాన్ని వారు వ్యాప్తి చేస్తున్నారు. సామ్రాజ్యవాద ప్రభువుల నోటినుండి వెలువడే శాంతి వచనాలు, దయ్యాలు వల్లించే నీతి సూక్తుల్లాగా ధ్వనిస్తున్నాయి. ఈ సామ్రాజ్యవాద దేశాలు వారి సామ్రాజ్యవాద స్వభావాన్ని వదలుకోలేదు; వదులుకుంటాయని ఊహించ లేము కూడా. మారిన ప్రపంచ పరిస్థితులలో మారిన తమ స్థానాలకనుగుణంగా తమ ప్రయోజనాల కనుగుణంగా వారు వ్యవహ రిస్తున్నారు. మారిన సామ్రాజ్యవాద దేశాల సమతుల్యత, ప్రస్తుత పోటీలో పాత వలస దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్ వంటివి ద్వితీయ స్థానంలోకి వచ్చాయి. అమెరికా, రష్యా వంటి దేశాలు ప్రపంచాధిపత్యానికి కావలసిన శక్తి సామర్ధ్యాలు, పథకాలతో పోటీపడుతూ ముందుకు వచ్చాయి. కనుక, శాంతి వచనాలు వల్లిస్తూనే ప్రపంచాధిపత్య రాజకీయాలకు వ్యతిరేకంగా యూరప్‌లోని సామ్రాజ్యవాద దేశాలు విడివిడిగానూ అదేవిధంగా కలిసికట్టుగా ప్రపంచ వనరుల లూటీపై అదుపుకోసం, మెరుగైన తమ వాటాకోసం పోటీపడుతున్నాయి.

సామ్రాజ్యవాద దేశాలు ఈనాడు ప్రపంచ ప్రజలకు వ్యతిరేకంగా భారీస్థాయి కుట్రలలో నిమగ్నమైయున్నాయి. చరిత్ర మొత్తాన్ని తప్పుగా వ్యాఖ్యానించటం, వాస్తవికమైన చరిత్రను తుడిచి పెట్టటమే ఈ కుట్ర. వలసవాదానికి, సామ్రాజ్య వాదానికి, ఫ్యూడలిజానికి, ప్రతీఘాతుకత్వానికి వ్యతిరేకంగా ప్రజలు వీరోచితంగా సాగించిన పోరాటంలో ఒలికించిన నెత్తురును, చేసిన అనన్య సామాన్యమైన త్యాగాలను వారు తుడిచివేయ దలుచుకున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో సామ్రాజ్యవాదుల కుట్రలను బట్టబయలు చేయటంకోసం – ప్రపంచ వ్యాపితంగానున్న కార్మికవర్గం, పీడిత దేశాలు, జాతులు కలిసికట్టుగా అవిశ్రాంత ఐక్యపోరాటం సాగించాలి.

ooooo